
సాక్షి సిద్దిపేట

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025

నాటి ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు

నాటి పురాతన కట్టడాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలవడమే కాదు ఆనాటి ఇంజనీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నిర్మించిన ఆ కట్టడాలు నేటికీ ఔరా.. అనిపిస్తున్నాయి. ఇంజనీర్స్ డే సందర్భంగా చారిత్రక కట్టడాల నిర్మాణాలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు..

8లో



న్యూస్‌రీల్

నిరుద్యోగులకు వరం ఉచిత కంప్యూటర్ శిక్షణ



బస్సును ప్రారంభిస్తున్న బైరి శంకర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉచిత కంప్యూటర్ శిక్షణ నిరుద్యోగులకు వరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వేదాస్ సంస్థలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన 35 మంది అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడానికి ఆదివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఉచిత కంప్యూటర్ శిక్షణతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు రాణించాలన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణలో ఉచిత వసతి, భోజనంతో పాటుగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ విద్యాసాగర్

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు సమాజాన్ని చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టాలని ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆదివారం పెద్దకోడూరులో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపును ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రీనరీ పెంచడం వల్ల భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందన్నారు. సమాజం కోసం ఏవిధంగా పని చేయాలో వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లతో ముచ్చటించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి



బెల్టులు ప్రదానం చేస్తున్న కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): ఆత్మ రక్షణకు కరాటే తోడ్పడుతుందని జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రేణుక గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కరాటేలో పోటీల్లోనూ రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కరాటే రాష్ట్ర అధ్యక్షుడు పాషా మాట్లాడుతూ కరాటేతో మానసిక, శారీరక, ఉన్నతితో పాటు ఉద్యోగాల్లో సైతం అవకాశాలుంటాయని అన్నారు. కరాటే మహిళలకు ఆత్మ రక్షణతో పాటు మనోధైర్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కరాటే జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశం, ప్రభాకర్, ఎల్లాగౌడ్, ఎల్లదాస్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి షోకాజ్ నోటీసు

గజ్వేల్: పట్టణానికి చెందిన బీజేపీ క్రియాశీలక నాయకుడు కాశమైన నవీన్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహ ముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 12న పట్టణంలోని అయ్యప్ప ఫంక్షన్ హాలు వద్ద పార్టీ నేతలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చించివేసి, అసభ్యపదజాలంతో దుర్భాషలాడినందువల్ల ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు.

కూడవెల్లి.. పరవళ్లు



భూంపల్లి వద్ద..



తొగుట వద్ద కూడవెల్లి ఉధృతం

చెక్‌డ్యాంలు మత్తళ్లు దూకుతూ ఎగువమానేరులోకి ..

దుబ్బాక: గోదావరికి ఉపనదిగా పిలిచే కూడవెల్లి వాగు ఇరవై రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుపై నిర్మించిన 28 చెక్‌డ్యాంలు నిండి పొంగి పొర్లుతున్నాయి. జగదేవ్‌పూర్ మండలం అలీరాజీపేట శివారులో పుట్టి గజ్వేల్, కొండపాక, తొగుట, మిరుదొడ్డి, భూంపల్లి–అక్బర్‌పేట, దుబ్బాక మండలాల గుండా 56 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఎగువమానేరులో కలుస్తుంది. ఈ వాగు ఆధారంగా సుమారు 40 వేల ఎకరాలకు పైగా పంటలు సాగవుతున్నాయి. కురుస్తున్న వర్షాలతో వాగు ఏ మాత్రం జోరు తగ్గకుండా ప్రవహిస్తుండటంతో వచ్చే యాసంగి పంటలకు కూడా ధోకా ఉండదని రైతులు చెబుతున్నారు.

కొమురవెల్లిలో భక్తుల సందడి



రాజగోపురం ఎదుట భక్తుల రద్దీ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగిరేణు చెట్టు ప్రాంగణంలో పట్నాలు వేసి ముడుపులు కట్టి మొక్కులు చెల్లించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ వెంకటేశ్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్‌లు పర్యవేక్షించారు.

కలవని చేతులు



జిల్లాలో కాంగి'రేసు'లో ఎవరికి వారే అనే విధంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. పార్టీలో ఇంకా విభేదాలు సమసిపోవడం లేదు. ఓ వైపు పార్టీ అధిష్ఠానం కలిసికట్టుగా ముందుకు సాగాలనే సంకేతాలిస్తుంటే జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. పార్టీకి నష్టం చేస్తున్నారని ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డికి పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజు నోటీసులు జారీచేసినట్లు, సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ నుంచి వివరణ అడిగినట్లు పీసీసీ వర్గాల ద్వారా తెలిసింది.

– సాక్షి, సిద్దిపేట

జిల్లా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డికి షోకాజు నోటీసులు
- హరికృష్ణను వివరణ కోరిన క్రమశిక్షణ కమిటీ

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతల మధ్య వర్గ విభేదాల పరంపర కొనసాగుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ వర్గపోరు తగ్గడం లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయకుండా ఎవరికి వారే వ్యవహరిస్తున్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా నాయకులు దృష్టిపెట్టడం లేదు. నామినేటెడ్ పదవులపై పెట్టిన శ్రద్ధ పార్టీ పటిష్టతపై పెట్టడం లేదని కార్యకర్తలు సైతం ఆరోపిస్తున్నారు.

నర్సారెడ్డిపై విజయ్ ఫిర్యాదు



గజ్వేల్ పట్టణంలో ఆగస్టు 3న రేషన్ కార్డుల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరు కాగా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా ఒకరి పై ఒకరు దూషించుకున్నారు. దీనితో నర్సారెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. అలాగే వీరిద్దరు పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి లకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో నర్సారెడ్డిని ఆదివారం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పిలిచారు. 'షోకాజు నోటీసులు జారీచేస్తున్నాం.. రాత పూర్వకంగా వారం రోజుల్లో వివరణ ఇవ్వాలి' అని చెప్పినట్లు తెలిసింది. దీనిపై నర్సారెడ్డిని వివరణ కోరగా నిజమని తెలిపారు.

హరికృష్ణను వివరణ కోరిన మల్లు



సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవిలకు ఆరుగురు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. ఎంపీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ కోసం పని చేయకుండా క్యాంప్ కార్యాలయానికే పరిమితం అయ్యారని, ఇటీవల ఇన్‌చార్జి మంత్రి మంజూరు చేసిన రూ.2 కోట్ల నిధులలో కమిషన్‌లు తీసుకున్నారని పలువురు ఆరోపిస్తూ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనితో మల్లు రవి స్పందించి వివరణ ఇవ్వాలని హరి కృష్ణను ఆదేశించారు. ఈ విషయం పై హరికృష్ణను వివరణ కోరగా 'నాకు ఎలాంటి నోటీసులు రాలేదు.. వస్తే ఎందుకు వచ్చాయో అందరికీ తెలియజేస్తాను' అని తెలిపారు.

ఎవరు లీక్ చేస్తున్నారు?

- కలెక్టరేట్‌లోని ఉన్నతాధికారి ఆరా
- తప్పును కప్పిపుచ్చుకునేందుకు సిబ్బందికి మెమోలు



సాక్షి, సిద్దిపేట: ఆఫీస్‌లో జరిగే విషయాలు బయటకు ఎలా వెళ్తున్నాయి? ఎవరు లీక్ చేస్తున్నారు? అనే అంశాలపై కలెక్టర్‌లోని ఉన్నతాధికారి ఆరాతీస్తున్నారు. ఈ నెల 7న 'సాక్షి' దినపత్రికలో దఫ్తర్‌లోనే బిస్తర్! అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఇలా పలు విషయాలు లీక్ చేస్తున్నారన్న కక్షతో కింది స్థాయి సిబ్బందికి మెమోలు ఇచ్చినట్లు వినికిడి. గొర్రెల పెంపకం అభివృద్ధి పథకం(ఎస్‌ఆర్‌డీఎస్)పై ఒక పక్క ఈడీ విచారణ జరుగుతుండగానే అందులో నుంచి రూ.2లక్షలను సదరు అధికారి నేరుగా డ్రా చేశారు. గజ్వేల్ నియోజకర్గం పరిధిలోని ఓ మండల వైద్యశాలకు తనిఖీకి వెళ్లిన సమయంలో డాక్టర్‌తో సిగరేట్ డబ్బా తీసుకురావాలని హుకుం జారీ చేశారని తెలిసింది. ఎస్‌ఆర్‌డీఎస్ పథకం అమలు కావడంతో గొర్ల కాపర్ల అభివృద్ధిపై ఈ నెల 10న క్షేత్రస్థాయిలో పరిశీలన, సదస్సుకు జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లికి రాష్ట్ర గొర్రెల డెవలప్‌మెంట్ ఎండీ సుబ్బారాయుడు వచ్చారు. ఓ ఉన్నత స్థాయి అధికారి వచ్చినప్పుడు వెళ్లాల్సి ఉండగా.. వెళ్లకుండా.. సుబ్బారాయుడు పరిశీలన ముగిసిన తర్వాత తాపీగా గజ్వేల్‌కు చేరుకున్నారు. ఇలా అనేక తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కార్యాలయంలో పని చేసే సిబ్బందికి పలువురికి మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని టీఎన్జీవోస్, వైద్యులు, గొర్రెల కాపర్ల సంఘం నేతలు కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నాణ్యమైన భోజనం అందించండి

- కలెక్టర్ హైమావతి
- రాఘవాపూర్ కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



వడ్డిస్తున్న కూరలను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ హైమావతి కేజీబీవీ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం మండల పరిధిలోని రాఘవాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం, తరగతులను గూర్చి అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట సీసీ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేధావులూ ఆలోచించండి

- నాడు సిద్దిపేట దేశంలోనే ఆదర్శం..
- నేడు ఆగిన ప్రగతితో వెలవెల
- మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: పదేళ్లుగా ప్రగతి పథంలో పయనించిన సిద్దిపేట.. రెండేళ్లుగా వెనుకబడిన ప్రక్రియపై మేధావులు, జర్నలిస్టులు ఆలోచించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో సిద్దిపేట దేశానికి ఆదర్శంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు. అధికారులు సిద్దిపేటకు వచ్చి అధ్యయనం చేసేలా గొప్పగా తీర్చిదిద్దుకున్నామన్నారు. ఇబ్రహీంపూర్‌ను ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల ప్రతినిధులు తిలకించిన విషయాన్ని గుర్తు చేశారు. బ్రిటిష్ అంబాసిడర్ సైతం సిద్దిపేట స్వచ్ఛతను చూసి కితాబిచ్చారన్నారు. నాటి అభివృద్ధిని జర్నలిస్టులు విజయగాథలుగా అద్భుతంగా రాశారన్నారు. అదే సిద్దిపేట.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఆగిన అభివృద్ధితో వెలవెల పోయిందన్నారు. ఒక బాధ్యతాయుతమైన జర్నలిస్టులు, మేధావులు ఆలోచించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో ఒక్క రూపాయి సిద్దిపేటకు రాలేదన్నారు. ఒక్క పని కూడా జరగలేదని వివరించారు. జర్నలిస్టు జీవితం అంతా ఇబ్బందులతో ముడి పడి ఉంటుందన్నారు. వారి కష్టాలు వర్ణనాతీతమన్నారు. కరోనా సమయంలో చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జిల్లా జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల త్యాగాలతోనే తెలంగాణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కమ్యూనిస్టు అమరుల రక్తతర్పణంతో నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. ఆదివారం మండలంలోని దౌలాపూర్‌లో సాయుధ రైతాంగ పోరాట అమరవీరులు, సీపీఐ నాయకుడు బీమన్న స్తూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణను నిజాం నవాబు తన ఆధీనంలో పెట్టుకుని పాలన సాగించారని తెలిపారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి మోహినోద్దీన్ తదితర కమ్యూనిస్టు నేతలు రైతాంగ సాయుధ పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దయానంద్‌రెడ్డి, జిల్లా నాయకులు రాజేశం, భిక్షపతి తదితరులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శతమానం భవతి



నిమ్మల రాములు వందవ పుట్టినరోజు వేడుకలు

నిండు నూరేళ్ల పండుగ.. ప్రస్తుత కాలంలో అత్యంత అరుదు. మనిషిజీవన ప్రమాణ కాలం తగ్గుతోంది. ఇలాంటి వేళ వంద ఏళ్లు జీవించిన వారు తమ ఆత్మీయులతో ఆనందంగా గడపడం మధురమైన అనుభూతి. అలాంటిదే జిల్లా కేంద్రంలోని 14 వార్డులో ఆదివారం జరిగింది. నిమ్మల రాములు 68 మంది (కుమారులు, కుమార్తెలు, ముని మనుమలు, మనుమరాళ్లు) మధ్య తన వందవ పుట్టినరోజు వేడుకలను ఆనందంగా జరుపుకొన్నారు.

– సిద్దిపేటజోన్

వంటేరు వజ్రమ్మకు నివాళి



శ్రద్ధాంజలి ఘటించిన మాజీ మంత్రులు, పలువురు నేతలు

వజ్రమ్మకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తల్లి వజ్రమ్మకు ఘన నివాళులర్పించారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో పదకొండు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాణిక్‌రావు, జనార్దన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు వజ్రమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల మాజీ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు, పార్టీ జిల్లా నేతలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. అలాగే శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, భక్తిరత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు వజ్రమ్మ చిత్రాన్ని సబ్బు బిళ్లపై అద్భుతంగా చిత్రించి ప్రతాప్‌రెడ్డికి అందించారు.

వయో వృద్ధులకు డే కేర్

వృద్ధుల సంరక్షణ, పునరావాసం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అటల్ వయో అభ్యుదయ యోజన పథకం ద్వారా డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సెంటర్ ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒంటరితనంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు ఇది ఊరటనిచ్చే అంశం.

– రామాయంపేట(మెదక్)



జిల్లాలో సుమారు నాలుగు వేలకుపైగా వృద్ధులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాల నిమిత్తం వెళ్లినప్పుడు ఒంటరితనంతో మానసిక ఆందోళనకు గురవుతున్నారు. తమను పలకరించేవారు లేక మనోవేదనకు గురవుతున్నారు. ఇలాంటి వారికి డే కేర్ సెంటర్ బాసటగా నిలవనుంది. ఇందులో ఇతర వృద్ధులతో కలిసి ఆడుతూ, పాడుతూ సంతోషంగా గడిపే అవకాశం ఉంటుంది. త్వరలో జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యే కేంద్రంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులు 50 మంది ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వృద్ధులు ఈ కేంద్రంలో ఉండడానికి వీలుగా ఇండోర్ గేమ్స్, గ్రంథాలయం, ఇతరత్ర సదుపాయాలు కల్పించనున్నారు. జిల్లాలో ఈ కేంద్రం ఏర్పాటు కోసం సేవా సంఘం అనే ఎన్జీఓకు అధికారులు బాధ్యతలు అప్పగించారు. మెదక్ పట్టణంలో ఒక భవనాన్ని సైతం ఎంపిక చేసినట్లు సమాచారం.

కేంద్రంలో ఉండే సదుపాయాలు

- వృద్ధులు ఆడుకోవడానికి వీలుగా క్యారం, చెస్‌తో పాటు ఇతర సదుపాయాలు
- సేదతీరడానికి ఆహ్లాదకర వాతావారణం, గార్డెనింగ్, మొక్కల పెంపకం
- వంట గది, గ్రంథాలయంతో పాటు ఇతర మౌలిక వసతులు
- తరచూ కేంద్రంలో ఆరోగ్య శిబిరాల నిర్వహణ
- వీల్ చైర్స్‌తో పాటు ర్యాంప్‌ల నిర్మాణం
- అత్యవసర పరిస్థితుల్లో అలారం సిస్టమ్ ఏర్పాటు
- మానసిక వేదన, భావోద్వేగానికి గురయ్యే వారికి కౌన్సెలింగ్

మనోధైర్యం కల్పిస్తాం



వృద్ధులను ఒంటరితనం నుంచి దూరం చేసి, వారికి అహ్లాదకర వాతావరణం కల్పించడానికి వీలుగా డేకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. వారి సంక్షేమానికి తమతో పాటు ఎన్జీఓ ఆర్గనైజేషన్ కృషి చేస్తుంది. వయోవృద్ధుల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తాం. వారికి అన్ని విధాలుగా మనోధైర్యం కల్పిస్తాం.

– హేమభార్గవి, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

కంగ్టి(నారాయణఖేడ్): పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ దుర్గారెడ్డి వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని శివారులో ఆదివారం పంట చేన్లలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 47,820 స్వాధీనం చేసుకున్నారు. వారితో పాటు చేను యజమానిపై సైతం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. దాడిలో పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్, సాయికిరణ్, సతీశ్ పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా..
పలువురికి గాయాలు

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మెదక్ నుంచి వస్తున్న టాటా ట్రాలీ వాహనం మూల మలుపు వద్ద అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆరు మందికి గాయాలు కాగా తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా లచ్చవ్వ అనే మహిళ పరిస్థితి విషమంగా ఉంది. సికింద్రాబాద్ బేగంపేట నుంచి మెదక్ చర్చికి వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం


కుర్నం నర్సింలు

సంగారెడ్డి క్రైమ్: బంధువుల ఇంటికి వచ్చిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... మానూరు మండలం డోవ్వురు గ్రామానికి చెందిన కుర్నం నర్సింలు(53) పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో కొత్త బస్టాండ్‌లో బస్సు దిగిన వెంటనే తన అల్లుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. అనంతరం బంధువులు కొత్త బస్టాండ్‌కు రాగా కనిపించలేదు. చుట్టుప్రక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి
బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సిద్దిపేటజోన్: ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేసే వర్కర్లకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో ప్రైవేట్ హాస్పిటల్స్ మజ్దూర్ మహాసంఘ్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. వర్కర్లకు సంవత్సరానికి ఒకసారి డీఏను కలుపుకొని జీతాలు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని, గ్రాట్యుటీతో కూడిన కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దసరా, దీపావళికి ఒక నెల బోనస్ ఇవ్వాలని, వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చామకూర రాజయ్య, ప్రైవేటు హాస్పిటల్స్ ఇన్‌చార్జి ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాటి ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు


- చెక్కుచెదరని కట్టడాలు
- కళాత్మకతకు, చరిత్రకు తార్కాణం

నేడు ఇంజినీర్స్ డే

నాటి పురాతన కట్టడాలు నేటి తరానికి చరిత్రను చెబుతాయి. పనిలో నైపుణ్యత కన్పిస్తుంది. ఆకాశాన్నంటుతాయా అన్నట్లు నిర్మించిన రాతి కట్టడాలు ఔరా అనిపిస్తాయి. అప్పటి ఇంజినీరింగ్ అద్భుతాలతో అబ్బుర పరుస్తాయి. కొలత వేసినట్లు సరిచేసిన భారీ రాళ్లను అంత ఎత్తుకు ఎలా చేరవేశారో ఆలోచింపజేస్తాయి. నేడు ఇంజినీర్స్ డే సందర్భంగా పురాతన కట్టడాలపై ప్రత్యేక కథనాలు.



1790లో నిర్మాణం


అప్పట్లో నిర్మించిన అతిథిగృహం

జహీరాబాద్: పట్టణంలో 65వ జాతీయ రహదారి పక్కనే 1790లో నిజాం పాలనలో అతిథి గృహాన్ని నిర్మించారు. ఈ భవనం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. భవనం, గోడల నిర్మాణం కోసం రాళ్లను ఉపయోగించారు. పై కప్పుకు ఇనుప స్తంభాలను వాడగా, డంగ్ సున్నంతో స్లాబ్ నిర్మించారు. ఇంజినీర్ల నైపుణ్యంతో నిర్మాణం చేపట్టడం మూలంగానే ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. హైదరాబాద్‌ను రాజధానిగా చేసుకున్న నిజాం రాజులు.. కర్ణాటకలోని బీదర్, గుల్బర్గా, మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నల్‌దుర్గ్, పర్భనీ, ఉస్మానాబాద్ తదితర ప్రాంతాలకు గుర్రాలపై ప్రయాణించే వారు. మార్గ మధ్యలో విశ్రాంతి తీసుకునేందుకు అప్పట్లో వారు ఈ అతిథి గృహాన్ని నిర్మించారు. మాజీ ప్రధానులు, మాజీ ముఖ్యమంత్రులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఈ అతిథి గృహంలో బస చేశారు.

చెక్కు చెదరని కోటదుర్గం


చందంపేట గ్రామంలో రాజుల కాలంలో నిర్మించిన కోట దుర్గం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో నిర్మించిన కోటదుర్గం 1395 నుంచి 1422 మధ్యలో రాణి చందమ్మ నిర్మించారు. వినూత్న ఇంజినీరింగ్ విధానంతో నైపుణ్యతతో దీనిని నిర్మించారు. 500 ఏళ్ల క్రితం నాలుగు వైపులా ఎత్తయిన బురుజులతో కోటను కట్టారు. నిర్మాణానికి పెద్ద రాళ్లను ఉపయోగించి డంగు సున్నంతో నిర్మించారు. రాళ్లకు చిన్నపాటి రంధ్రాలు చేసి కరిగించిన ఇనుమును పోసి రాయికి రాయికి ఆనుకుని ఉండేలా బిగించారు. కోటపైకి వెళ్లేందుకు నిర్మించిన కోటగుమ్మం మెట్లు చిమ్మ చీకట్లో దారి కన్పించకుండా నిర్మించారు. ఏ జంకు లేకుండా సరైన దారిలో వెళ్లేవారికి ఒక్కసారిగా చిమ్మచీకట్లు మాయమై సూర్యకాంతులు విరజిమ్మడం కన్పిస్తాయట. ఈ కోట నిర్మాణం అప్పట్లో శత్రువులకు అంతు చిక్కకుండా సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు.

గడికోట.. గత వైభవానికి ప్రతీక

పెద్దశంకరంపేటలోని గడికోట



పెద్దశంకరంపేట: శతాబ్దాల చరిత్రకు నాటి కళాత్మకతకు, ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనం పెద్దశంకరంపేట గడికోట. 400 ఏళ్ల క్రితం 40 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ కోట ఇప్పటికీ పర్యాటకులను ఆకట్టుకుంటుంది. పెద్దశంకరంపేట గ్రామంలో ఉన్న ఈ కోటను 1764లో రాణి శంకరమ్మ కట్టించినట్లు ఆధారాలున్నాయి. నిజాం పాలనలో అతిపెద్ద సంస్థానాలుగా ఉన్న పెద్దశంకరంపేట, పాపన్నపేటలను రాజధానిగా చేసుకొని శంకరమ్మ, వారి వారసులు పాలించారు. ఈ కోటను చతురస్రాకారంలో, నాలుగు బురుజులతో నిర్మించారు. దీనిలో గుర్రప్రు, ఏనుగు శాలలు ఉన్నాయి. కోటలోని ఫిరంగులను స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేశారు.


చౌదరిపల్లి బురుజు.. అద్భుతం


చౌదరిపల్లిలో ఉన్న ఎత్తైన చతురస్రాకార బురుజు

వర్గల్(గజ్వేల్): మండలంలోని చౌదరిపల్లి గ్రామ నడిబొడ్డున ఆకాశాన్ని తాకుతున్నట్లు శతాబ్దాల క్రితం నిర్మితమైన చతురస్రాకార బురుజు అప్పటి మానవ మేధస్సును, ఇంజినీరింగ్ అద్భుతాన్ని చాటుతుంది. పెద్ద పెద్ద బండ రాళ్లను ఏనుగుల సాయంతో పైకి చేరవేసినట్లు చెబుతుంటారు. పొందికగా పేర్చిన రాళ్ల వరుస, బురుజు శిఖరాన తీర్చిదిద్దిన పిట్టగోడ, లోపలి నుంచి పైదాక మెట్లు, ప్రవేశద్వారం, అంతా రాతి నిర్మాణమే. శత్రువుల ఉనికి గుర్తించే నిఘా కేంద్రంగా ఎత్తైన బురుజు పైనుంచి నలువైపులా దృష్టి సారిస్తూ సైనికులు కాపలా కాసేవారని సమాచారం.

పటిష్టతకు అద్దం రంగంపేట కోట

కోట ముఖ ద్వారం



కొల్చారం(నర్సాపూర్): నిజాం కాలం నాటి హైదరాబాద్ రాజ్యంలో ఉన్నటువంటి 14 సంస్థానాల్లో పాపన్నపేట సంస్థానం ఒకటి. వారి కిందే కొనసాగింది నిజాం నవాబులచే రాయ్ భాగన్(ఆడ సింహం)గా బిరుదును పొందిన రాణి శంకరమ్మ. ఆమె దత్త పుత్రుడు సదాశివరెడ్డి చే 1700 సంవత్సరం మధ్యకాలంలో నిర్మించిందే రంగంపేట కోట. దాదాపు పదెకరాల విస్తీర్ణంలో నిర్మించాడు. చుట్టూ నాలుగు బురుజులు, రెండు ప్రధాన ద్వారాలు, రాణి మహల్, మెట్ల బావి, గుర్రప్రు శాల, అంతర్గత డ్రైనేజీ నిర్మాణం, అద్దాల మేడ, గోడలపై నకశిల్పాలు ఇలా ఎన్నో ప్రస్తుతం కోటలో శిథిలావస్థకు చేరుకొని కనిపిస్తాయి. ఈ కోట బురుజు పైనుండి చూస్తే మెదక్ ఖిల్లా కనిపించడం విశేషం. నిర్మాణానికి రాయితోపాటు డంగు సున్నాన్ని వాడారు.

ఎర్రరాయితో మెథడిస్టు చర్చి..

ఎర్రరాయితో అద్భుతంగా నిర్మించిన మెథడిస్టు సెంట్రల్ చర్చి



జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లో నిర్మించే ఇళ్లలో 90 శాతం ఎర్రరాయి కట్టడాలే. నవాబుల కాలం నాటి నుంచి నేటి వరకు స్థానికంగా లభించే ఎర్రరాయిని వినియోగిస్తారు. ఈ రాయితో పట్టణంలో మెథడిస్టు సెంట్రల్ చర్చిని అద్భుతంగా నిర్మించారు. చర్చి వ్యవస్థాపకుడు జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో అన్న అరెల్ట్, డీబీ గార్డెన్, రూత్ ప్యాటరైజ్ పట్టణంలోని అల్లీపూర్ ప్రాంతంలో 1931లో నిర్మాణానికి శ్రీకారం చుట్టి 1951లో పూర్తి చేశారు. శిలువ ఆకారంలో నిర్మించిన చర్చి ఇంజినీరింగ్ నైపుణ్యానికి అద్దం పడుతుంది. దీనికి దగ్గరలో నిర్మించిన పాఠశాల భవనం కూడా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. తరగతి గదుల్లో గాలి, వెలుతురు ప్రవేశించే విధంగా నిర్మించారు.

రాజీపేట టూ రాష్ట్ర స్థాయికి

- వేస్ట్ పేపర్లతో టీఎల్ఎం మెటీరియల్
- మేళాలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన
- యూపీఎస్ ఉపాధ్యాయురాలు కీర్తి


వేస్ట్ పేపర్లతో తయారు చేసిన ప్రాజెక్టుతో మేళాలో ఉపాధ్యాయురాలు కీర్తి

కౌడిపల్లి(నర్సాపూర్): ఆలోచనకు పదునుపెట్టి సరైన పద్ధతిలో వినియోగిస్తే పనికిరానిది ఏది ఉండదని, ప్రతీది వినియోగించు కోవచ్చని రుజువు చేసింది ఓ ఉపాధ్యాయురాలు. వేస్ట్ పేపర్లతో తయారు చేసిన ప్రాజెక్టు ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళాలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచి రాజీపేట టూ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. వివరాలు ఇలా... మెదక్‌లో జరిగిన ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి), టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాలో రాజీపేట యూపీఎస్ ఉపాధ్యాయురాలు కీర్తి పల్లె, పట్టణం మధ్యలో తేడాలు చూపుతూ తరగతిలోని వేస్ట్, న్యూస్ పేపర్లు, అట్ట ముక్కలు, చార్ట్, గడ్డి, దారం, పాడైన పెన్నులు, రిఫిల్స్‌తో గమ్‌ప్లాస్టర్ అందమైన పట్టణం, గ్రామం ఆకారాలు తయారు చేసి ప్రదర్శించారు. ఇందులో రహదారులు, వాహనాలు, పంటపొలాలు, అపార్ట్‌మెంట్‌లు, ఫ్యాక్టరీ, నీటికాలుష్యం, పార్క్, జూను పల్లె, పట్టణ వాతావరణం కనిపించేలా తయారు చేశారు. దీంతో మేళాలో ఆకట్టుకోవడంతో డీఈఓ రాధాకిషన్, అధికారులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. దీంతో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి మేళాలో ప్రదర్శించనున్నారు. ఉపాధ్యాయురాలు కీర్తిని మండల ఎంఈఓ బాలరాజు, హెచ్ఎం కిశోర్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి


బోడ లక్ష్మణ్

జహీరాబాద్: విద్యార్థులు జాతీయ భావాన్ని పెంపొందించుకుని దేశ భక్తులుగా ఉండాలని ఏబీవీపీ మెదక్ విభాగ్ సంఘటన మంత్రి బోడ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలలో రెండు రోజుల శిక్షణ, వర్గ ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతి పునర్‌నిర్మాణం అవుతుందన్నారు. నగరాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఇన్‌చార్జి మాసాడి బాపూరావు, ప్రాంత సహ సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యకర్తలు, పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన జట్టు


బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన మెదక్ జిల్లా బాలికల జట్టు

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మెదక్ జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 12 నుండి 14 వరకు జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండలం కూనూరులో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో ఖమ్మం జిల్లా జట్టును ఓడించి మెదక్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ట్రోఫీతో పాటు బహుమతులు ప్రదానం చేశారని ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రెటరీ పీవీ.రమణ, ట్రెజరర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ శరణప్ప తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య


బండారి చిన్నక్క

నిజాంపేట(మెదక్): మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు... పోలీసుల వివరాల ప్రకారం .. నిజాంపేట గ్రామానికి చెందిన బండారి చిన్నక్క(37) వ్యవసాయ కూలీ చేసుకుని జీవనం కొనసాగిస్తుంది. ఈ మేరకు ఆదివారం ఉదయం తన భర్త యాదగిరి పొలంలో మందు చల్లడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో చిన్నక్క ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేశాడు.

మద్యానికి బానిసైన వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్ : మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన లక్ష్మణ్(39) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రోజు మద్యం తాగుతుండటంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా మార్పు రాలేదు. రోజు తాగుతుండటంతో భార్య నిహారిక మూడు నెలల క్రితం పిల్లలను తీసుకుని తల్లి గారింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన లక్ష్మణ్ ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సదాశివపేట(సంగారెడ్డి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ రెండు స్లాబుల విధానంలో 85 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడం వల్ల మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలపై ఆదివారం పట్టణంలోని బసవ సేవాసదన్ ఫంక్షన్ హాలులో వర్తక, వాణిజ్య వ్యాపారస్తులతో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇన్‌కమ్ టాక్స్ 12 లక్షల వరకు మినహాయింపు ఇవ్వడంతో మధ్యతరగతి ఉద్యోగులకు లాభం చేకూరుతుందన్నారు. మోదీ ప్రధాని పదవి చేపట్టిన రెండున్నరేళ్లలోనే రాజకీయ పార్టీలను ఒప్పించి 2017లో జీఎస్టీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేశారన్నారు. వస్తువులపై జీఎస్టీ తగ్గించడం వల్ల మార్కెట్లో వస్తువుల కొనుగోళ్లకు చాలా డిమాండ్ పెరుగుతుందని వ్యాపారులకు కూడా మంచి లాభాలు వస్తాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎంత మొరిగినా మోదీ భయపడలేదని, దేశాన్ని కాపాడుకుంటానని వేసిన అడుగులే స్వదేశీ వైపు వేసే అడుగులని ప్రతి ఒక్క భారతీయుడు గర్వించతగ్గ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఆస్తి పంపకాలు, పదవుల కూర్చేల పంచాయితీ నడుస్తుందన్నారు. కార్యక్రమంలో మెదక్ బీజేపీ పార్టీ కోకన్వీనర్ సంగమేశ్వర్, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, జగన్, వేణుమాధవ్, వ్యాపారస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సీతారాంపూర్ కాలనీకి చెందిన సయ్యద్ అమీర్ (25) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అయితే మెకానిక్ షాప్ సరిగా నడవక పోవడంతో పాటు తీసుకున్న ఆటో ఈఎంఐ కట్టలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 12న ఇంటి నుండి బయటకు వెళ్లి యాసిడ్ తాగి అతడి భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

మరో ఘటనలో...

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కర్దనూర్‌కి చెందిన దేవయ్య(50) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన అతడు తాగే క్వార్టర్ బాటిల్‌ను బాత్రూంలో దాచిపెట్టాడు. ఈ క్రమంలో ఆగస్టు 24న బాత్రూంలో ఉన్న మద్యం తాగి.. పక్కనే బాటిల్‌లోని యాసిడ్‌ను నీళ్లు అనుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎర్రగడ్డ ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.

మధ్యప్రదేశ్ పోలీసుల అదుపులో ఇద్దరు..

చేర్యాల(సిద్దిపేట): మధ్యప్రదేశ్‌లో జరిగిన హత్య కేసులో అనుమానితులుగా ఉన్న ఇద్దరిని పోలీసులు ఆదివారం మండల పరిధిలోని ఆకునూరులో అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామంలో మేస్త్రీ పనులు చేస్తున్న ధర్మేందర్, ఖసీన్ ఇద్దరు భార్యాభర్తలు. కొద్ది రోజుల క్రితం ఖసీన్ తల్లి హత్య జరిగింది. ఈ హత్యతో ఇద్దరికి సంబంధం ఉందని అనుమానించిన మధ్యప్రదేశ్ ఎస్‌టీఎఫ్ పోలీసుల బృందం ఆదివారం ప్రత్యేక వాహనంలో గ్రామానికి వచ్చి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వెళ్లినట్లు సమాచారం. భార్యాభర్తలను పోలీసులు వచ్చి తీసుకుపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని చెప్పారు.

ఇందిరమ్మ.. మరింత వేగవంతం

- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్
- లబ్ధిదారులే ఫొటో అప్‌లోడ్ చేసే అవకాశం
- ఇల్లు ప్రారంభించని వారికి రుణ సౌకర్యం


ఇంటి నిర్మాణంను పరిశీలిస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: నిరుపేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టింది. ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో 90 శాతం నిరుపేదలే కావడంతో డబ్బులు లేక పనులు ప్రారంభించలేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా ఇసుక తెచ్చుకునేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కొన్ని నిర్మాణాలు చేపట్టగా ఇంకా చాలా మంది నిర్మాణాలు మొదలు పెట్టలేదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత ఉండాలని, లబ్ధిదారులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. ఇటీవల జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం ఏఈలతో సమావేశం నిర్వహించి టోల్ ఫ్రీ నంబర్ లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆరు నియోజకవర్గాలకు..

మెదక్, నర్సాపూర్, గజ్వేల్, దుబ్బాక, ఆందోల్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాలకు చెందిన 21 మండలాలు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఉంటాయి. అన్ని మండలాలకు కలిపి మొత్తం 9600 ఇండ్లు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటి వరకు 5వేల ఇళ్లు ప్రారంభం కాగా 360 ఇళ్లు బేస్మెంట్ స్థాయిలో ఉన్నాయి. ఇంకా ప్రారంభానికి నోచుకోనివి 4వేలకు పైచిలుకు ఉన్నాయి. కాగా లబ్ధిదారులు తహసీల్దార్ ద్వారా ఆమోదం పొంది ప్రభుత్వం ఇసుక తెచ్చుకునే వీలు కల్పించింది. ఇంటి నిర్మాణం ప్రారంభించలేని నిరుపేదలకు స్వయం సంఘాల నుంచి రూ.లక్ష వరకు రుణాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గ్రామాల్లో లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమం కొనసాగుతుంది.

లబ్ధిదారులే నేరుగా..

పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకుంటే లబ్ధిదారులే నేరుగా ఫొటోతోపాటు తమ వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయొచ్చు. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పారదర్శకత, బిల్లుల సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1800 5995991 ఏర్పాటు చేసింది. కంట్రోల్ రూం హైదరాబాద్‌లో ఉంటుంది. బిల్లులు, నిర్మాణం తదితర సమస్యలపై లబ్ధిదారులు నేరుగా ఫోన్‌చేసి మాట్లాడవచ్చు. ఇటీవల హౌసింగ్ పీడీ జిల్లాలోని ఏఈలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేటప్పుడు ఏర్పడిన సమస్యలను ఈ నంబర్‌కు కాల్‌చేసి చెబితే అధికారులు కావాల్సిన సహాయం అందిస్తారు.

రూ.23కోట్లు అందించాం



జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన రెండు వేలపై చిలుకు లబ్ధిదారులకు రూ.23కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం. అలాగే ఉచితంగా ఇసుక తెచ్చుకునే అవకాశం కల్పిస్తున్నాం. నిర్మాణాలు చేపట్టే ఆర్థిక స్తోమత లేని నిరుపేదలను గుర్తిస్తున్నాం. వారికి సమాఖ్య సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి ఇల్లు నిర్మించుకునేలా కృషి చేస్తున్నాం. టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

– మాణిక్యం, హౌసింగ్ పీడీ, మెదక్